క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పెరుమాళ్ల మౌనిక అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గోపాల్ తెలిపారు. సోమవారం ఆ విద్యార్థినిని అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. ఏలూరు జిల్లా కైకవరంలో ఈ నెల 6, 7 తేదీల్లో జరుగనున్న 4x100 మీటర్ల రిలే పరుగు పందెంలో మౌనిక పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన పీడీ రాజశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దేవస్థాన అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాధికారులు భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. అలాగే దేవస్థాన గోసంరక్షణశాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. మార్కాపురానికి చెందిన ఎల్‌వీ ప్రసాదరెడ్డి గోసంరక్షణ శాలకు ఔషధాలను విరాళంగా అందజేశారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఎమ్మెల్యేను వేదపండితులు ఆశీర్వదించగా, ఈఓ స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

నైపుణ్య గణనపై శిక్షణ

పాములపాడు: యువతలోని నైపుణ్యాలను వెలికి తీయడమే నైపుణ్య గణన లక్ష్యమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించాలని చెప్పారు. అవసరమైన వారికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా చేస్తారని చెప్పారు. ఈఓపీఆర్డీ రంగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ సమావేశం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీ ఓ సుమిత్రమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశానికి పంచాయతీరాజ్, హౌసింగ్ అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఉపాధి కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు

రైతులు ప్రీమియం చెల్లించాలి

ఆత్మకూరు: మండలంలో రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. ఆయన సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రీమియం చెల్లిస్తేనే ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితు ల్లో పంటలు నష్టపోయినప్పుడు పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు గ్రామ సచివాలయాలు, ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. అలాగే పంటల వివరాలను జాతీ య పంటల బీమా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతుల నుంచి ప్రీమియం మొత్తా న్ని బ్యాంకులే మినహాయించుకుంటున్నాయ న్నారు. డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించాలని ఏఓ సూచించారు. వివరాలకు స్థానిక రైతు సేవా కేంద్రాలను సందర్శించాలన్నారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది లతమ్మ, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు. .

నాటుసారా స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామానికి చెందిన ఓ మహిళ నాటుసారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. వివరాలు.. ముందుగా అందిన సమాచారం మేరకు చౌట్కూరు గ్రామంలో దాడులు నిర్వహించి నాటుసారా విక్రయిస్తున్న దూదేకుల మాసుంబీని అరెస్ట్ చేసి, 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

బండిఆత్మకూరు: మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలో బాలిక తల్లిదండ్రులకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పార్నపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం మైనర్ బాలికకు వివాహ నిశ్చితార్థం నిర్వహించారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో సమక్షంలో బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లి చేయకూడదని, అలా చేయటం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారికి వర్తించే శిక్షల గురించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ దస్తగిరి, సర్పంచ్ షబ్బీర్, వీఆర్ఓలు ఉన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యలు–పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలను తక్షణమే పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీడీ అన్వరాబేగం, ఏఈలు బషీర్, నాగేంద్ర, ఏపీఎం అంబమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సిబ్బంది ఆకలికేకలు

- నాలుగు నెలలుగా జీతాలు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- అర్ధాకలితో అలమటిస్తూ సేవలందిస్తున్న వైనం
- నిర్వహణ లేక తుప్పుపట్టిపోతున్న 108 వాహనాలు

కుయ్.. కుయ్ అంటూ ప్రజల ప్రాణాలను రక్షించేందుకు మెరుపు వేగంతో సాగే ఆపద్బాంధవులనే కుయ్యో.. మొర్రో అంటూ మొత్తుకునేలా చేసింది కూటమి ప్రభుత్వం. వాహనాలే కాదు, అందులో పనిచేసే సిబ్బందినీ పక్కన పెట్టేసింది. జీతాలు లేక జీవితాలు రోడ్డున పడుతున్నాయి. పసివాళ్లు మొదలు పెద్దల వరకు ఆకలి కేకలు వేస్తుంటే తమ వారిని తలచుకుని 108 ఉద్యోగి గుండె బరువుతో జీవచ్ఛవమైపోతున్నాడు. చేసేది లేక పంటి కిందే పుట్టెడు బాధను బిగపట్టి విధి నిర్వహణకు పయనమవుతున్నాడు. తిండి లేక చేయి చాస్తుంటే అప్పు కూడా పుట్టడం లేదు. ఎప్పుడు తిరిగిస్తావని అడిగితే తేదీని చెప్పలేక తడబడుతున్న దైన్యం. ఇది రాష్ట్రంలో 108 సిబ్బంది ప్రస్తుత పరిస్థితి.

నందికొట్కూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 108 సిబ్బంది జీవితాలు దుర్భరంగా మారాయి. నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క నెల జీతమైనా రాలేదు. జూన్ నెలలో కూటమి ప్రభుత్వం కొలువుదీరితే జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ జీతాలు ఇప్పటికీ జమచేయలేదు.

శిథిలావస్థలో వాహనాలు

నంద్యాల జిల్లాలో 108 అంబులెన్స్ వాహనాలు 27 సేవలందిస్తున్నాయి. వీటిలో ప్రతి వాహనం లక్షకు పైగా కిలోమీటర్లు తిరిగినవే. ఇవన్నీ కాలం చెల్లిన స్థితికి చేరుకున్నాయి. పల్లెటూళ్లు, మండల ప్రాంతాల్లో సేవలందించే వాహనాలు మరింత అధ్వానంగా మారాయి. జీతాలు అందకపోయినా సిబ్బందే నానా యాతనలు పడి వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. మరి వాటి బిల్లుల సంగతి ఏమిటో దేవుడికే ఎరుక.

ఉద్యోగులా? బానిసలా?

108 సిబ్బంది విధుల నిర్వహణ తీరు బానిసలను తలపిస్తోంది. సిబ్బంది రోజులో 12 గంటలు పనిచేయాలి. వారంలో చేసే 24 గంటల అదనపు పనికి ఎటువంటి చెల్లింపూ ఉండదు. అంతే కాదు.. వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం మరింత శోచనీయం. వీరు స్కీంలో భాగంగా అరబిందో సంస్థ ఉద్యోగులుగానే పరిగణించబడతారు. 108 సేవలను నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగికి పీఎఫ్ సౌకర్యం ఉంటుంది. అయితే ఉద్యోగి, యాజమాన్యం భాగస్వామ్యం రెండూ వారి జీతాల నుంచే జమ అవుతాయి. సిబ్బంది



108 అంబులెన్స్ వాహనాలు

కొరత జిల్లా 108 విభాగాన్ని తీవ్రంగా వేధిస్తోంది. 150 మందికిగాను 133 మంది ఉద్యోగులే ఉన్నారు. వీరిలో పైలెట్లు 67 మంది కాగా, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు 66 మంది ఉన్నారు. ఒక్కో వాహనానికి కనీసం ఐదుగురు ఉద్యోగులు రెండు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉన్నా, ఆ ఊసే లేదు. వీరిలో ఏ ఉద్యోగికీ వారాంతపు సెలవులు లేవు. పండగ పబ్బాలేమీ ఉండవు. ఎప్పుడు డ్యూటీ వేస్తే అప్పుడు చేయాల్సిందే.

ఇంతటి ప్రయాసలో సిబ్బంది ఉన్నా ఇంక్రిమెంట్ల ఊసే లేదు. గత ప్రభుత్వ హయంలో జీతాల చెల్లింపు నుంచి వాహనాల నిర్వహణ పకడ్బందీగా సాగేది. కానీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక వారి జీవితాలు దుర్భరమయ్యాయి.

ప్రజలకు ప్రాణ సంకటం

ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్లు 108 సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తుంటే ఆ ప్రభావం ప్రజల మీద పడుతోంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అరబిందో సంస్థకు బిల్లుల చెల్లింపు మానేసిందని, అందుకే వారు 108 సిబ్బందికి జీతాలు చెల్లించలేకపోతున్నారని ప్రచారం ఉంది. సంస్థకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం, సంస్థ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోవడం, పాడుబడ్డ వాహనాలు వినియోగిస్తుండడం, సిబ్బంది కొరత, ఈ కారణాలతో వాహనాలు సకాలంలో ప్రమాద స్థలికి చేరుకోలేకపోతున్నాయి. ఇవన్నీ ప్రజల పాలిట ప్రాణ సంకటంగా పరిణమిస్తున్నాయి.

గోల్డెన్ అవర్ కాన్సెప్ట్‌కు తూట్లు

ప్రమాదం జరిగిన వ్యక్తిని గంటలోపు ఆసుపత్రికి చేర్చి వైద్యం అందిస్తే బతికే అవకాశాలు 80 శాతం ఉంటాయన్నది గోల్డెన్ అవర్ కాన్సెప్ట్, స్వతహాగా వైద్యుడైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పరిస్థితిని ఆకళింపు చేసుకుని 108 సేవలను తీసుకొచ్చారు. ఆయన ఆశయం సత్ఫలితాలిచ్చి నాటి నుంచి నేటి వరకు కొన్ని లక్షల ప్రాణాలు నిలిచాయి. అయితే ఆయన ఆదర్శానికి నేటి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. మెరుపు వేగంతో దూసుకురావడానికి 108 వాహనాలు మునుపటి కండీషన్‌లో లేవు. ప్రాణాలు నిలిపే వాహనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయి.

నిరసన బాట

ఇన్ని వ్యయప్రయాసల మధ్య 108 సిబ్బంది నిరసన బాట పట్టక తప్పని స్థితి అనివార్యమైంది. పస్తులుంటూ పనిచేస్తున్నా కూడా ప్రభుత్వ పెద్దల మనస్సు కరగడం లేదు. దీంతో సీఐటీయూ అనుబంధ 108 ఉద్యోగుల సంఘం దశల వారీ నిరసనకు పిలుపునిచ్చింది. ముందుగా జిల్లా అధికారులకు, అరబిందో సంస్థకు, ఎన్టీఆర్ ట్రస్టుకు వినతి పత్రాలు అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు మెయిల్ ద్వారా తమ సమస్యలు వెల్లడించారు.

కార్మిక శాఖలో చలనం లేదు



సిబ్బంది పీఎఫ్‌ను అక్రమంగా దోచేస్తున్న అరబిందో సంస్థ నిర్వాకంపై కార్మిక శాఖ అధికారులను కలిసినా ఫలితం లేదు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా పరిస్థితి ఇలా ఉంటే మిగతా చోట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రాజకీయ కక్ష సాధింపులతో 108 సిబ్బంది కుటుంబాలను రోడ్డున పడేశారు. దీంతో నిరసన అనివార్యమైంది. ఉద్యోగులకు సీఐటీయూ అన్ని విధాలా అండగా ఉంటుంది.

– లక్ష్మీనారాయణరెడ్డి, 108 ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవారిని అలంకరించారు. అనంతరం గణపతిపూజ,పుణ్యాహవాచనం, అలంకార పూజలు చేపట్టి ఆల య ప్రాకారంలో పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

– నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.రాధారాణి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. పల్లకీ సేవలో పాల్గొన్నారు. నిర్వాహకులు స్వామివారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

కార్తీక సందడి

కార్తీకమాసం, మొదటి సోమవారం సందర్భంగా మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వేకువజాము నుంచి రాత్రి వరకు ఆలయంలో రద్దీ కొనసాగింది. అభిషేకప్రియుడైన మహానందీశ్వర స్వామికి 70కి పైగా అభిషేకాలు జరిగాయి. భక్తులు స్థానిక అభిషేక మండపంలో రుద్రాభిషేకం, ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద కేదారేశ్వర నోముల వ్రతాలు జరిపించారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల మధు, పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.





మహానందీశ్వరుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం, రుద్రాభిషేకం పూజల్లో పాల్గొన్న భక్తులు

వసూళ్లకు పాల్పడితే చర్యలు

మహానంది: మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కొబ్బరికాయలు కొట్టేందుకు భక్తుల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై సోమవారం ఈఓ హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా వసూళ్లకు పాల్పడితే సస్పెన్షన్ తప్పదన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో అన్నదానం చేపడుతున్నామని, భక్తులకు సరిపడా ప్రసాదాలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

శివాలయాల్లో కార్తీక పూజలు



ప్రత్యేక అలంకరణలో మహాశివుడు



ఓంకారంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు: కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా రుద్రకోడు క్షేత్రంలో వెలసిన రుద్రాణి సమేత రుద్రకోటేశ్వర స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు నల్లగండ్ల నారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రుద్రాణి మాతకు కుంకుమార్చనలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు కోనేరులో స్నానం ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

పట్టణంలోని శివాలయాల్లో..

పట్టణంలోని అన్ని శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. మహాశివుడికి ప్రత్యేక అలంకరణ చేసి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పార్వతీమాతకు కుంకుమార్చన, విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.

ఓంకార క్షేత్రంలో భక్తుల రద్దీ

బండిఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పంచబుగ్గల కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి ఓంకార సిద్ధేశ్వర స్వామిని, అమ్మవారిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత వ్యాస మహర్షిచే ప్రతిష్ఠింపబడిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నల్లమల కొండపై ప్రతిష్ఠించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాలి నడకన వెళ్లి దర్శించుకున్నారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండల పరిధిలోని సప్తనది తీరం, సంగమేశ్వరం ఉమామహేశ్వరాలయంలో పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో కార్తీకమాసం తొలి సోమవారపు పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని సత్యనారాయణ స్వామి, లలితా సంగమేశ్వర స్వామి, శివ కేశవ మూర్తులకు పలువురు దంపతులచే సామూహిక సత్యనారాయణ వ్రతములు చేయించారు. అదే విధంగా పుష్పార్చన, తులసీ దర్శన అర్చనలు, శ్రీ లలితా సంగమేశ్వరస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేష పూజా క్యాక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా లలితా సహస్త్ర నామ పారాయణం, శ్రీచక్ర కుంకుమార్చన, సాయం సంధ్యా పూజా సమయం నిర్వహించారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అర్జీలను సత్వరం పరిష్కరించండి

కొత్తపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో ఆధార్‌కార్డులో పుట్టిన తేదీలు తప్పుగా ఉండడంతో బర్త్ సర్టిఫికెట్లు కావాలంటూ 21 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భూమస్యలు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖకు సంబంధించి 51 అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలతో పాటు గ్రామసభలలో రైతులు ఇచ్చిన అర్జీలను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డీటీ పెద్దన్న, వీఆర్వోలు ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ ఉమారాణి

ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం

బండిఆత్మకూరు: ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటాలు సాగిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పార్నపల్లి టీటీడీ కల్యాణ మండపంలో సీపీఎం మూడో మహాసభ నిర్వహించారు. డేవిడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమలో అతిథి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద మధ్యతరగతి ప్రజలకు భద్రత లేకుండా పోయిందని, మద్యం ఏరులై పారుతోందని, ఇసుక అందని ద్రాక్షగా మారిందని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం రత్నమయ్యను మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు మండల కమిటీ సభ్యులుగా ఎస్.రాజు, వి.సుబ్బారాయుడు, ఎం.మాబు, టి.భాగ్యమ్మలను ఎన్నుకున్నారు.

సర్వే పక్కాగా చేపట్టండి

వెలుగోడు: చెంచుగూడెంలలో నిర్వహించే సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌డీఓ సూర్యనారాయణ సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని కాలేజీ సమీపంలో ఉన్న విజయదుర్గ చెంచు కాలనీలో జరుగుతున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. చెంచుగూడెంలలో ప్రజల స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. గూడెం వాసులకు స్థలాలు, గృహాలు, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి వాటిపై సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి సుంకన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విజయదుర్గ చెంచుకాలనీలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సూర్యనారాయణ

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వెలుగోడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రసాయన అవశేషాల్లేని ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, మార్కెట్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఉందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రబీలో సాగు చేసే పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఉపాధి హామీ ఏపీవో మల్లికార్జున, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి

నందికొట్కూరు: విద్యార్థులు భగవద్గీతను చదవడం అలవర్చుకోవాలని తిరుమల, తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని నవనంది విద్యాసంస్థలో సోమవారం భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం వల్ల వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని, అప్పుడే సమాజంలో దుష్పరిణామాలు దూరమవుతాయన్నారు.

రైతులను మోసగించిన కూటమి ప్రభుత్వం

నందికొట్కూరు: రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని 5వ సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తే అధిక వర్షాలతో నీటి పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా కూటమి ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ప్రాజెక్టులు, చెరువులు, ఎత్తిపోతల పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మల్యాల సుజల స్రవంతి, హంద్రీనీవా పథకం ద్వారా రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం సచివాలయ ఉద్యోగులకు అందజేశారు. రైతు సంఘం నాయకులు రామకృష్ణ, భాస్కర్‌గౌడ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలని వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నందికొట్కూరు: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ప్రతిభ చాటిన విద్యార్థులు పీ.షాతి మా, బీ.శరణ్య, ఎస్.నస్రీన్‌లకు ఎస్ఐ బహుమతు లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపరీతంగా పెరుగుతున్న సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం రఫిఅహ్మద్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ తిరుపాలు

ఎస్టీటీఎఫ్ గౌరవాధ్యక్షులుగా జవహర్‌నాయక్

ఆత్మకూరు: ఎస్టీటీఎఫ్ అధ్యక్షుడు గొర్ల సుధాకర్ అధ్యక్షతన నంద్యాల పట్టణంలో ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులుగా జవహర్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలపై పోరాడుతానన్నారు. సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలంగిరి కుమార్, సంయుక్త కార్యదర్శి మాతృనాయక్, రామకృష్ణ, చంద్రమోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

పాములపాడు: మండలంలో 25 గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 250 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వీటిని పూర్తిగా పరిశీలించి 25 మంది జాబితా సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపామని వివరించారు. 4 పశువుల గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.1.80 లక్షలు, 6 పశువుల షెడ్డుకు రూ.2.80 లక్షలు మంజూరవుతాయని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఏపీఓ విమలమ్మ వెంట ఉన్నారు.